క్లుప్తంగా

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



పెనుగంచిప్రోలు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం పదో తరగతి విద్యార్థులకు జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన స్నాక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉన్నత మైన మార్కులు సాధించాలన్నారు. ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత నిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులు తనిఖీ



వత్సవాయి: ఎరువులు, పురుగు మందుల షాపులను మండల వ్యవసాయాధికారి వి.రవి కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మక్కపేట, వత్సవాయిలో షాపులను పరిశీలించారు. షాపులలో ఉన్న స్టాకు, రికార్డులలో నమోదు అయి ఉన్న వివరాలను చెక్ చేసి సరిచూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన ధరలకే రైతులకు ఎరువులను అమ్మాలన్నారు. నిబంధలనకు విరుద్ధంగా అమ్మకాలు జరిపితే షాపుల అనుమతులు రద్దుచేస్తామని హెచ్చరించారు.

కిటకిటలాడిన వేంకటేశ్వరాలయం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకుని గిరి ప్రదక్షిణ ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీరామవరప్రసాదరావు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం



నందిగామ: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణే లక్ష్యంగా ముందు జాగ్రత్త ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ సతీష్ పేర్కొన్నారు. 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఇటీవల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై అంబారుపేట క్రాస్ రోడ్ వద్ద శనివారం ప్రమాదాలు నివారించేందుకు రేడియం స్టిక్కర్లు , స్టాప్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ ఓ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాహనాలు నడిపేటప్పుడు కూడా అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

31లోగా బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ

మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు



జగ్గయ్యపేట అర్బన్: పురపాలక సంఘ పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలు ఈనెల 31వ తేదీ లోగా మొత్తం బకాయిలు ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆర్వో రత్నావళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవో మేరకు రాష్ట్రంలో అన్ని నగర పాలక, పురపాలక సంఘాల్లో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలను, ఈ ఆర్థిక సంవత్సరం పన్నుపై విధించిన వడ్డీ మాఫీ చేసే వీలుందన్నారు. పన్ను చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్ని ఒకేసారి ఈనెల 31వ తేదీ లోపు చెల్లిస్తే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జగ్గయ్యపేట బలుసుపాడు రోడ్డులో తీర్చిదిద్దిన ఇల్లు



ముక్త్యాలలో సుందరంగా నిర్మించిన జగనన్న గృహం



తిరుమలగిరిలో నూతనంగా నిర్మించిన ఇల్లు

సొంతింటి కల నెరవేరుతున్న వేళ

పేదోడి సొంతింటి కల సాకారమవుతోంది. కట్టుకునేందుకు జాగా లేక ఆర్థిక స్తోమత చాలక ఇన్నాళ్లు అద్దె ఇళ్లల్లో ఉన్న వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక చేయూత అందించారు. మండలంలోని 17 గ్రామాల్లో పేదలకు స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 1758 మందికి సెంటు భూమి చొప్పున పంపిణీ చేశారు. సెంటు భూమిలో లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలు అద్భుతంగా, ఆకర్షణీయంగా పూర్తి చేసుకుంటున్నారు. ఇప్పటికే 1017 మంది ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. ప్రస్తుతం 400 పైగా నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన గృహాల నిర్మాణానికి లబ్ధిదారులు శ్రీకారం చుట్టారు. – జగ్గయ్యపేట

జగనన్న కాలనీల్లో గృహాలు ప్రారంభం

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): జగనన్న కాలనీల్లో ప్రభుత్వం లబ్ధిదారులకు సకల సౌకర్యాలు కల్పిస్తోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం గ్రామంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసిన స్థలంలో నిర్మించిన గృహాలను ఎంపీపీ మార్కపూడి గాంధీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకులు సామినేని వెంకటకృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ముఖంలో సంతోషం నింపటమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: వీఆర్వోలు ఆయా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ఆశయ నాయక్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో వీఆర్వోలతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఆర్వోలు గ్రామాల్లో రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముగిసిన సువార్త సభలు

సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): మానవాళికి వెలుగు చూపిన మహనీయుడు ఏసుక్రీస్తు అని తెలంగాణ ప్రాంతానికి చెందిన పాస్టర్ ఎం ఇస్సాకు, ఎస్.కొర్నేలి అన్నారు. గత రెండు రోజులుగా గ్రామంలో పాస్టర్ ఎం యాకోబు ఆధ్వర్యంలో జరుగుతున్న సువార్త మహాసభలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా యాకోబు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

వత్సవాయి: అకాలవర్షానికి నేలవాలిన మొక్కజొన్న పంటను శనివారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. పత్తి పంటను తొలగించిన తరువాత మండలంలో మొత్తం 3600 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేసినట్లు మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ తెలిపారు. గ్రామ సచివాలయాలలోని వ్యవసాయ, ఉద్యాన శాఖలకు చెందిన సిబ్బంది ద్వారా దెబ్బతిన్న పంటలను లెక్కించగా 1800 ఎకరాల్లో రైతులు పంటను నష్టపోయినట్లు తెలిపారు. నష్టపోయిన పంట, రైతుల వివరాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు.

వివాహిత అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు తాడేపల్లికి చెందిన కొత్తపల్ల శ్రీహరి, ప్రియాంకలు భార్యాభర్తలు. శ్రీహరి క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తుంటాడు. 17వ తేదీ ప్రియాంక అత్త గారికి అనారోగ్యంగా ఉండటంతో వైద్యం నిమిత్తం విజయవాడకు వచ్చింది. సాయంత్రం ప్రియాంక ఫోన్ నుంచి నా ఇష్టపూర్వకంగా వెళుతున్నాను... నా గురించి వెతకవద్దని మెసేజ్ రావడంతో ఆందోళన చెందిన భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్టా మహోత్సవం



పూజలు చేస్తున్న సామినేని విమలాభాను



విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమంలో భక్తులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని చెరువు బజారులో పునర్నిర్మించిన శ్రీ సీతారామ మందిరం (చిన్న రామాలయం)లో శనివారం శ్రీహనుమత్ సీతారామ చంద్ర, లక్ష్మణ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితులు బాచినప్ప కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మూర్తి సాంబశివరావు యాజ్ఞికంలో అర్చకులు మంగు సాయి చైతన్యశర్మ తదితరులు ఉదయం 8 గంటలకు గణపతి పూజ గర్తన్యాసం, బీజాన్యాసం ధాతున్యాసం నిర్వహించారు. అనంతరం 10.18 నిమిషాలకు యంత్ర ప్రతిష్ట శ్రీహనుమత్ సీతారామచంద్ర, లక్ష్మణస్వామి వార్ల ప్రతిష్ట వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా జరిగింది. మహోత్సవాల్లో భాగంగా అర్చకులు స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.

ప్రత్యేక పూజలు..

ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సతీమణి సామినేని విమలాభాను స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయభాను కుమార్తె, అల్లుడు మారెళ్ల విజయనరసింహారెడ్డి, పద్మ ప్రయాంక ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజున్నీసా, కౌన్సిలర్ కాశి అనురాధ తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం స్వామి వారి శాంతి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి



మాట్లాడుతున్న చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి

నందిగామ: పట్టణ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని నగర పంచాయతీ చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి పేర్కొన్నారు. నగర పంచాయతీ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఉదయం 11:30కు చైర్ పర్సన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 40 అంశాలపై చర్చ జరిగింది. అనంతరం ఆయా అంశాలను తీర్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ప్రధానంగా వేసవికాలంలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలోని పలు ప్రధాన రహదారులు అభివృద్ధి కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ముఖ్యంగా పలు ప్రధాన రహదారులు అభివృద్ధి చేయడంతో పాటు వాటికి ప్రముఖుల పేర్లను నామకరణం చేయనున్నట్లు తెలిపారు.

విస్తరణ పనులపై రాద్ధాంతం..

పట్టణంలో పలు ప్రధాన రహదారుల విస్తరణ పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే.. ఈ నేపథ్యంలో ఆయా రహదారుల విస్తరణకు అడ్డం వస్తున్న పలు చెట్లను ఇటీవల ఫారెస్ట్ అధికారుల అనుమతితో తొలగించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు కొందరు చెట్ల తొలగింపుపై రాద్ధాంతం చేసే ప్రయత్నం చేశారు. ఈ తరుణంలో కౌన్సిలర్ యాకూబ్, కో ఆప్షన్ సభ్యుడు దాసు వారి ప్రశ్నలకు ఘాటుగా సమాధానమిచ్చారు. పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతుంటే ఉద్దేశ పూర్వకంగానే ప్రతిపక్షం ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. కొట్టిన చెట్లు రూ.50 లక్షల వరకు విలువ చేస్తాయని టీడీపీ కౌన్సిలర్లు వాదిస్తున్నారని ఆ రూ.50 లక్షలు నగర పంచాయతీకి ఇచ్చి మీరే తీసుకుంటే, ఆ డబ్బుతో మరికొన్ని అభివృద్ధి పనులు చేసుకోవచ్చని ఆరో వార్డు కౌన్సిలర్ యాకూబ్ పేర్కొన్నారు. పలు అంశాలపై అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు వాదోపవాదాలు చేసుకున్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్ పర్సన్లు మాడుగుల నాగరత్నం, ఓర్సు లక్ష్మి, మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' కరపత్రాల పంపిణీ



నందిగామలో చలో ఢిల్లీ కరపత్రాలు పంచుతున్న సీఐటీయూ నాయకులు

నందిగామ: కేంద్రంలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. చలో ఢిల్లీ కరపత్రాలను శనివారం నందిగామ పట్టణంలో ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సామాన్యులను పట్టించుకోకుండా ఆదాని, అంబానీ లాంటి వారి సేవలో బీజేపీ ప్రభుత్వం మునిగి తేలుతోందన్నారు. ముఖ్యంగా ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కులను కూడా కాలరాస్తోందని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసిన వారిపై అక్రమ కేసులు కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా అనుకూల విధానాల కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక, కర్షక పోరాట ప్రదర్శనలో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రజా బలాన్ని కేంద్రానికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సయ్యద్ ఖాసిం, గోపి నాయక్, షేక్ హుస్సేన్, గంగాధర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు



పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, స్థానికులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో అన్ని వార్డుల్లో ప్రాధాన్యతా క్రమంలో డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు. స్థానిక 1, 6వ వార్డుల్లో డ్రెయిన్లు లేక ఇబ్బందులు పడుతున్న స్థానికులు ఇటీవల మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రను కలిసి సమస్యలు వివరించారు. స్పందించిన ఆయన ముందుగా జేసీబీని పంపించి ప్రజలు ఇబ్బందులు పడకుండా కచ్చా డ్రెయిన్లు తీయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వార్డు ప్రజలు పనులను పర్యవేక్షించారు. వార్డు ప్రజల ఫిర్యాదు మేరకు గృహాల మధ్య ఖాళీ స్థలాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా ఉండటంతో జేసీబీతో శుభ్రం చేయించారు. వార్డు ప్రతినిధులు భానుప్రకాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతుకు కష్టం



కేతవీరునిపాడు ప్రాంతంలో నేలకొరిగిన మొక్కజొన్న



పెనుగంచిప్రోలులో మిర్చి రాశులపై కప్పిన పట్టాలపై నిలిచిన వర్షపు నీరు



కల్లాల్లో మిర్చిపై పట్టాలు కప్పుతున్న రైతులు



మిర్చి తడవకుండా కప్పిన పట్టాలు



కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద నీరు

వీరులపాడు: అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు తీరని కష్టాన్ని కలిగిస్తున్నాయి. మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. మండలంలో 950 ఎకరాలలో రైతులు మిర్చి పంట సాగు చేయగా 1100 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవటంతో కల్లాల్లో ఉన్న మిర్చి పంటను పట్టాలు కప్పి కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే లక్షలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులు పెట్టారు. పంట కోసి కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంట వర్షార్పణమవటంతో ఈ ఏడాది కూడా నష్టాలు తప్పేలా లేవని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న పంట సైతం చేతికొచ్చే దశలో కురిసిన అకాల వర్షానికి అక్కడక్కడా పంట నేలకొరిగింది.

పెనుగంచిప్రోలు: మండలంలో శనివారం సాయంత్రానికి ఒక్కసారిగా నల్లని మేఘాలు కమ్ముకుని వర్షం పడటంతో రైతులు పొలాలకు పరుగులు తీశారు. వాతావరణ శాఖ చెబుతున్న వర్షాలతో రైతుల కంటి మీద కునుకు కరువైంది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంటను కాపాడుకునేందుకు రైతులు పట్టాలు కప్పుకుంటున్నారు. ఈఏడాది మండలంలో 6 వేల ఎకరాల్లో మిర్చి, 900 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మిర్చి రైతులు కల్లాల్లో మిర్చి రాశులపై పట్టాలు కప్పుకోవటంతో పాటు కోతలు కొద్ది రోజులు వాయిదా వేసుకోవాలని ఏఓ రామసుబ్బారెడ్డి అన్నారు. మొక్కజొన్న కూడా ప్రస్తుతానికి ఎటువంటి నష్టం లేదన్నారు. వర్షాలు కొద్ది రోజులు ఆగితే బాగుంటుందని రైతులు అంటున్నారు.

నందిగామ: నందిగామ ప్రాంతంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలులకు మండలంలోని పలు ప్రాంతాల్లో మొక్కజొన్న పైరు నేలకొరిగింది. ఇక మిర్చి రైతులు ముందు జాగ్రత్తగా కల్లాల్లో ఉన్న మిర్చి పంటపై పరదాలు కప్పి జాగ్రత్తలు చేసుకున్నారు. మరింత భారీ వర్షం కురిస్తే మిర్చి దెబ్బతింటుందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వైరా, కట్టలేరు ఉపనదులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో నందిగామ మండలం దాములూరు కూడలి వద్ద వైరా నదిపై ఉన్న కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తోంది. ఈ తరుణంలో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

ఇతరులకు సాయం చేయడమే మానవీయత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రతి ఒక్కరూ మానవీయతను అలవర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ మానిటరింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పి.విజయప్రకాష్ చెప్పారు. సిద్ధార్థ ఫౌండేషన్ 24వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయప్రకాష్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తనకు అవసరమైనంత వరకు తన దగ్గర ఉంచుకుని మిగిలిన వాటిని ఇతరులకు పంచడమే మానవీయత అన్నారు. మనుషుల్లో మాత్రమే ఈ మానవీయత ఉంటుందన్నారు. కానీ నేటి పోటీ ప్రపంచంలో ఎవరి బిజీ జీవితాల్లో వారు ఉండి ఇతరుల గురించి ఆలోచించే పరిస్థితులు లేవని చెప్పారు. అలాంటి సమాజంలో ఇతరులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో సిద్ధార్థ ఫౌండేషన్‌ను స్థాపించి ఈ విధంగా లక్షల రూపాయలను విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. సిద్ధార్థ ఫౌండేషన్ అధ్యక్షుడు సి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ ద్వారా ఉపకార వేతనాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. సిద్ధార్థ ఫౌండేషన్ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ ఏడాది పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న 600 మంది విద్యార్థులకు రూ.50 లక్షలు ఉపకార వేతనాలుగా అందిస్తున్నామని వెల్లడించారు.

ఔషధ రంగంలో ఫార్మకోవిజిలెన్స్ ముఖ్యపాత్ర



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నూతన వ్యాధుల చికిత్సా పద్ధతుల్లో ఔషధ ప్రభావాలు పర్యవేక్షించేందుకు, మందుల సమాచారాన్ని సేకరించడం, విశ్లేషించడం ప్రతికూల చర్యలను నివారించడంతో ఫార్మకోవిజిలెన్స్ ముఖ్యపాత్ర పోషిస్తుందని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ఫార్మకా లజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఫార్మకో విజి లెన్స్ అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ కంచర్ల సుధాకర్ మాట్లాడు తూ ఫార్మకోవిజిలెన్స్ ప్రోగ్రామ్ ఎంతో ముఖ్యమైనదన్నారు. ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ ఔషధాల భద్రతకు ఫార్మకో విజిలెన్స్ ద్వారా ముందడుగు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఔషధం జీవిత చక్రంలో భద్రత, సమర్థత అనేవి ముఖ్యమైనవిగా పేర్కొన్నారు. ఫార్మకో విజిలెన్స్ అనేది ఔషధ భద్రతలో అంతర్భాగమని చెప్పారు. అనేక వ్యాధుల నివారణకు సంబంధించిన అధ్యయనంలో జరిగే ప్రతికూల ఘటనలను ఎదుర్కోవడానికి దోహదం చేస్తుందన్నారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ మందుల వినియోగంలో కొందరు రియాక్షన్స్‌కు గురవుతుంటారని, అలాంటి వారిపై అధ్యయనం చేసి నివారించేందుకు ఈ ఫార్మకో విజిలెన్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్మోహనరావు, ఫార్మకాలజీ విభాగానికి చెందిన డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ వినీత, డాక్టర్ అనూష పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ సీపీఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ నాగరాజుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వలన మొక్కజొన్న, మిర్చి, మినుములు, వరి, కూరగాయల పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రైతులకు నష్టపరిహారం అందజేయాలని కోరారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, పట్టణ సహాయ కార్యదర్శి షేక్ అసదుల్లా, మెటికల శ్రీనివాస్, గుడిసె కిషోర్ పాల్గొన్నారు.